




కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

# రైతులకు న్యాయం చేయాలి

**- జెసికి ఎపి రైతు సంఘం వినతి**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

హోళగుంద మండలం నాగకన్వి గ్రామంలో రైతులకు సంబంధించిన ఇనాం భూములను పట్టా భూములుగా మార్చి రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జాయింట్ కలెక్టర్ నవ్యకు జి. రామకృష్ణతో పాటు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు ఎ.కృష్ణ, కోటకొండ సూరి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రైతుల భూములు ఆన్ లైన్‌లో లేక పోవడం చేత రైతులందరూ మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో లేకపోవడంతో బ్యాంకుల్లో రుణాలకు ఇబ్బంది పెడుతున్నాయన్నారు. ఇప్పటికే రైతులు అనేక రకాలుగా ఆందోళన చెందుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల మరింత మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతుల పట్ల సానుకూలంగా ఉండాల్సింది పోయి ఇబ్బంది పెట్టేటువంటి చర్యలు తీసుకోవడం శోచనీయమన్నారు. తరతరాలుగా పట్టాలు కలిగి ఉండి అనుభవిస్తున్న పొలాలను రీ సర్వే సందర్భంగా ఈనాం భూములని రావడంతో రైతులను భ్రంగ తీసిందని వారు తెలిపారు. ఒకవేళ ఇనామ్ మరొకవేళ సర్వీస్ ఇనాములని రకరకాల పేర్లతో రైతులను ఇబ్బంది పెట్టడం ఏమాత్రం సమంజసం కాదని వారు తెలిపారు. జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ వెంటనే సరిచేసి రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగిరెడ్డి, గోవిందరెడ్డి, వెంకటరెడ్డి, మల్లికార్జున రెడ్డి, శివమ్మ, పార్వతమ్మ, వసలింగప్ప, ఎం.శివమ్మ, ఎం.లక్ష్మిరెడ్డి, వాసవి, సరస్వతి, కల్లుగొడ, వాసే నీలకంఠ, గాదె లింగారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలి**

జిల్లా కేంద్రంలో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు ఓర్వకల్లు కల్లూరులలో అత్యధికంగా పొగాకు పంట సాగు చేశారన్నారు. పండిన పంటను మొత్తాన్ని కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వమే న్యాయమైన రేటు ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వరలక్ష్మి తక్షణమే ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ ఆదేశించారు.

# పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ - కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కేసీ కెనాల్ పోరంబోకు సర్వేనెంబర్ 67/1, 781 భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ ధర్నా చేశారు. ఓల్డ్ సిటీ కమిటీ నాయకులు సి.నాగరాజు అధ్యక్షతన జరిగిన ధర్నాలో జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యులు విజయ రామాంజనేయులు మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నా పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వాలకు చేతులు రావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చలేకపోయారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేకసార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. జిఒ నెంబర్ 31 ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే పేదలు వేసుకున్న గుడిసెలు అన్నిటికీ పట్టాలు మంజూరుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే గుడిసెలు వేసుకున్న పేదలందరితో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కర్నూలు అర్బన్ తహశీల్దార్ రవికుమార్‌కు సిపిఎం ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించింది. నగర కమిటీ సభ్యులు బి.రంగస్వామి మునిస్వామి, నూర్ వలి, జనార్ధన్, మాసూమ్, మాలన్, అమీనాభి, లక్ష్మీదేవి, వేణమ్మ, రాధమ్మ, రేష్మ ఆటో యూనియన్ నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

# ప్రమోషన్ల తర్వాతే బదిలీలు...

**- సచివాలయ ఉద్యోగుల జెఎసి ధర్నా**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ వార్డు సచివాలయాలలో పనిచేసే ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని కర్నూలు పట్టణ సచివాలయ ఉద్యోగుల జెఎసి కోఆర్డినేటర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ముందు కర్నూలు నగర వార్డు సచివాలయాల ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు జెఎసి కోఆర్డినేటర్ శివప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కారం దిశగా సచివాలయ ఉద్యోగులతో కమిషనర్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను విని పరిష్కరించాలని చెప్పారు. తమ పరిధిలో లేనివి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. వార్డు సచివాలయం సెక్రటరీలు అందరికి ఖచ్చితమైన సర్వీసు రూల్స్ రూపకల్పన చేయాలన్నారు. అన్ని కేటగిరీల సచివాలయ సెక్రటరీలకు సరైన ప్రమోషన్ ఛానల్ కల్పించాలని చెప్పారు. రేషనలైజేషన్‌లో జనరల్ పర్పస్ కార్యదర్శులకు, స్పెసిఫిక్ పర్పస్ కార్యదర్శులకి కేటాయించే విధులపై స్పష్టత ఇస్తూ మిగులు సిబ్బందిని ఎక్కడ ఎలా ఉపయోగించుకుం టారో స్పష్టత ఇవ్వాలన్నారు. జిఒఎంఎస్ నంబర్ 5, 2025జూన్ 12 ప్రకారం కాకుండా వార్డు కార్యదర్శులకి ఎలక్షన్ వార్డును ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. తదనుగుణంగా గౌరవ సిడిఎంఎ, ఎల్ రికార్డు నంబర్ 2025 జూన్ 22న చెప్పారని, నోషనల్ ఇంక్రిమెంట్లు,9 నెలల అరియర్స్ మంజూరు చేయాలన్నారు. బకాయి ఉన్న డిఎలు వెంటనే విడుదల చేయాలని అన్నారు, పిఆర్‌సి కమిషన్ ను నియమించాలి, లేదా ఐఆర్‌ని వెంటనే ప్రకటించాలని కోరారు. సచివాలయాలలో కనీస సదుపాయాలు వెంటనే కల్పించే విధంగా శాశ్వత ఆదేశాలు వెంటనే జారీ చేయాలని కోరారు. ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై అన్ని క్యాడర్ల ఉద్యోగ సంఘాలతో వెంటనే చర్చలకు పిలవాలన్నారు. అనంతరం అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు చక్రధర్, వీరంజి యాదవ్, రవికుమార్ నగరంలోని వార్డు సచివాలయాల అన్ని విభాగాల కార్యదర్శులు ఉద్యోగులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

# అంగన్వాడీలకు పథకాలు వర్తింపజేయాలి

**- కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ధర్నా**

**ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్**

అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్‌కు ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రేణుక అధ్యక్షతన జరిగిన ధర్నాలో పాల్గొన్న పిఎస్ రాధాకృష్ణ, పి.నిర్మల మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో 42 రోజులు సమ్మె చేసి సాధించుకున్న వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అంగన్వాడీలు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా వచ్చి అనేక రకాల వాగ్దానాలను కూటమినేతలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వ హయంలో ప్రభుత్వ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, సాధించుకున్న జీవోను కూడా అమలు చేయక పోవడం దురదృష్టకరమన్నారు. తల్లికి వందనం డబ్బులు అంగన్వాడీ పిల్లలకు పడలేదన్నారు. వేతనాలు పెంచడం ఊసేలేదని, మరోపక్క పని చేయడానికి ఇబ్బందిక రంగా భారంగా ఉన్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తొలగించమని డిమాండ్ చేస్తుంటే ఇవి చాలదు అన్నట్లు మరో రెండు కొత్త యాప్లను తెచ్చిందన్నారు. అదేవిధంగా రాజకీయ వేధింపులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇటువంటివి మానుకొని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తు న ఆందోళన చేయడానికి అంగన్వాడీలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు న్యూ సిటి కార్యదర్శి సిహెచ్‌సాయిబాబా, ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్, అంగన్వాడి యూనియన్ నాయకులు గోవర్ధనమ్మ, వరలక్ష్మి, బాల దరగమ్మ, పద్మ, వరలక్ష్మి, ప్రభావతి పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు

# జిజిహెచ్ యురాలజీలో మూడు పెద్ద ఆపరేషన్లు

**- వైద్యులను అభినందించిన డాక్టర్ కె.వెంకటేశ్వర్లు**

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సూపర్ స్పెషలిటీ బ్లాక్ లోని యురాలజి విభాగంలో హెచ్ఒడి , ఇంచార్జీ ప్రొఫెసర్ డాక్టర్ పి.ముత్యశ్రీ, యూరో ఆంకాలజిస్ట్ డాక్టర్ సేపూరి బాల రవితేజ, అనస్తిషియా డాక్టర్ పి.మురళి ప్రభాకర్ ఆధ్వర్యంలో అరుదైన మూడు ఆపరేషన్లను నిర్వహించారు. సోమవారం యూరాలజీ విభాగంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సమక్షంలో హెచ్ఒడి , ఇంచార్జీ ప్రొఫెసర్ డాక్టర్ పి.ముత్యశ్రీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...కోడుమూరుకు చెందిన భావన 75 సంవత్సరాలు మూత్ర సంచి , కుడి కిడ్నీకి క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. దానిని లాప్రోస్కోపీ పద్ధతితో ఈనెల 12న ఆపరేషన్ చేసి కుడి , మూత్ర సంచిని విజయవంతంగా తొలగించారు. ఎమ్మిగనూరుకు చెందిన మరొక పేషంట్ శ్రీనివాసులు 55 సంవత్సరాలు హెపటైటిస్ బి పేషంట్ కి కుడి కిడ్నీలో క్యాన్సర్ ఉండి ఈ క్యాన్సర్ శరీరంలోని పెద్ద రక్తకణాలు అయినా అమోట , ఐవిసికి చుట్టు పక్కల ఉన్న లైపోగ్రంథులకి పాకీ , వాటికి అత్తుకొని ఉండడంతో ఈనెల 13న ఆపరేషన్ చేసి క్యాన్సర్ కిడ్నీతో పాటు సుమారు ఐదు సెంటీమీటర్లు ఉన్న మూడు లైపో గ్రంథాలన తీసివేశారు. ఆత్మకూరుకు చెందిన 59 సంవత్సరాల అఫ్జల్‌బీకి ఎడమ ఎడ్రినలిన్ గ్రంధిలో 12 సెంటీమీటర్ల క్యాన్సర్ గడ్డ ఉండడంతో , పేషెంట్ అధిక బరువుతో ఉండడం వలన పెద్ద కోత లేకుండా లాప్రోస్కోపీ పద్ధతి ద్వారా విజయవంతంగా వాటిని తొలగించారు. ఈ మూడు అరుదైన సర్జరీలను ఆరోగ్యశ్రీలో ఉచితంగా విజయవంతగా చేశారు. ఈ అరుదైన మూడు ఆపరేషన్లను నిర్వహించిన డాక్టర్ల బృందానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. బయట 5 నుంచి 6 లక్షల ఖరీదైన ఆపరేషన్లను ఎక్కువ టైం బట్టి ఆపరేషన్స్, ఎలాంటి కుట్లు లేకుండా, లాప్రోస్కోపి పద్ధతిలో విజయవంతంగా చేసినందుకు యూరాలజీ విభాగం హెచ్ఒడిని, డాక్టర్ల బృందాన్ని ఆయన అభినందించారు. కర్నూలు యూరాలజీ విభాగంలో రెగ్యులర్ యూరాలజీ సర్జరీలతో పాటు కాంప్లెక్స్ యూరోలాజికల్ , కిడ్నీ, అడ్రినల్, మూత్ర సంచి ప్రొస్టేట్, టెస్టికల్ పురుషాంగం కు సంబంధించిన క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్నాయని తెలిపారు.



పెద్ద ఆపరేషన్లు నిర్వహించిన డాక్టర్ల బృందంతో ఉన్న సూపరింటెండెంట్



మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

# మోకాళ్లపై నిల్చుని నిరసన

**48వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఆప్కాస్ కు సంబంధించిన పంప్‌హౌస్, ఎలక్ట్రిసిటీ పార్క్‌లో పనిచేసే ఉద్యోగుల నిరవధిక సమ్మె 48వ రోజుకు చేరింది. సోమవారం ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు మోకాళ్ళపై నిలిచి నిరసన తెలిపారు. వారు చేస్తున్న సమ్మె ఫలితంగా నగరంలో తాగునీటి సరఫరాలో సమస్య ఏర్పడింది. పాతబస్తీలోని ఎర్ర బురుజు, కెవిఆర్ గార్డెన్, ఉస్మానియా కాలేజ్ రోడ్డు, బనగానపల్లె హోటల్ లవ్ బాలి దర్గా, ఖడక్‌పురా, తెలుగు గేరి, బొంగుల బజార్ తదితర ప్రాంతాల నుండి తమకు నీళ్లు రావడం లేదని మహిళలు పెద్ద ఎత్తున నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చి కమిషనర్‌కు తమ గోడును వినిపించారు. వారికి అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి పంపించారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ

**ప్రజాశక్తి కథనానికి స్పందన..**

**ప్రజాశక్తి పత్తికొండ**

పత్తికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంఇఒ- 2 రమేష్ సోమవారం తనిఖీ చేశారు. 'విద్యార్థులకు కలుషితనీరే గతి ' అనే కథనాన్ని ప్రజాశక్తి ప్రచురించడం పాఠకులకు విధితమే. ప్రజాశక్తి కథనానికి స్పందించిన ఎంఇఒ-2 రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. తుప్పు పట్టిన ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలించామని ,వెంటనే ఆర్ఒ ప్లాంట్‌ను వినియోగం లోకి తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలతి, ఉపాధ్యాయుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఒ ప్లాంటును పరిశీలిస్తున్న ఎంఇఒ రమేష్

# భావితరాలకు స్ఫూర్తి..ఒలింపిక్ జ్యోతి...

**-నగర ప్రధాన కూడలిలో ప్రారంభమైన ఒలింపిక్ పరుగు**
**- పరుగులో పాల్గొన్న 2500 మంది క్రీడాకారులు**
**-విజేతలకు బహుమతులను ప్రదానం**

**ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్**

ఒలింపిక్స్ ఇచ్చిన స్ఫూర్తితో భావితరాలకు క్రీడల పట్ల చైతన్యం తెచ్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని కర్నూలు ఒలంపిక్ సంఘం చైర్మన్, మాజీ మంత్రి కెఇ ప్రభాకర్ అన్నారు. సోమవారం కర్నూలు జిల్లా ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ రన్ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఓల్డ్ టౌన్‌లో ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి ఆధ్వర్యంలో పరుగును ప్రారంభించారు. రెండవ కేంద్రమైన కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో మాజీ మంత్రి కెఇ. ప్రభాకర్, జిల్లా ఒలంపిక్ సంఘం సిఇఒ విజయ్ కుమార్, నిర్వహణ కార్యదర్శి పి సునిల్ కుమార్, జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీని ప్రారంభించారు. మూడో కూడలి ఎపిఎస్‌పి రెండవ బెటాలియన్ నుంచి డిఎస్‌పి మెహబూబ్‌బాష ప్రారంభించారు. నాలుగవ ప్రాంతం బిర్లా గేట్ వద్ద ఉన్న ఖానా ఖజానా నుంచి జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, పిఇటిల అధ్యక్షుడు జోసఫ్, లక్ష్మయ్య ప్రారంభించారు. ఐదవ కూడలి చెన్నమ్మ సర్కిల్ నుంచి క్రీడా సంఘాల ప్రతినిధులు వెటరన్ సంఘం కార్యాదర్శి రవికుమార్, ఈశ్వర్ నాయుడు ల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ పరుగు రాజ్ విహార్‌కు చేరుకున్నాయి. అక్కడి నుంచి క్రీడా జ్యోతులతో అతిథులు కర్నూలు ఔట్ డోర్ స్టేడియం చేరుకున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో మాజీ మంత్రి కెఇ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడా చైతన్యం నింపేందుకు గత 15 సంవత్సరాలుగా కర్నూలు నగరంలో రాజకీయాలకు అతీతంగా ఒలింపిక్ పరుగును నిర్వహిస్తున్నామన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పరుగులో పాల్గొని విజయవంతం చేయడం ఆనందదాయకమన్నారు. ఒలింపిక్ పరుగు నిర్వహణలో రాష్ట్రంలోనే కర్నూలు ప్రథమ స్థానంలో ఉందన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ మాట్లాడుతూ క్రీడాకారులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని తాము ఎంచుకున్న క్రీడల్లో రాణించాలని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ చూసినా క్రీడాకారుడికి లభించిన గుర్తింపు ఏ ఇతరులకి లభించదని అన్నారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిరోజు కొంత సమయాన్ని క్రీడల సాధనకు కేటాయిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో పాల్గొని వాటి ద్వారా వచ్చే ప్రశంసా పత్రాలతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను సాధించవచ్చని అన్నారు. అనంతరం అంతర్ పాఠశాలల పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శన చూపరులకు కనువిందు చేసి విశేషంగా ఆకట్టుకున్నాయి. ఐదు ప్రాంతాల నుంచి సుమారు మూడు వేల మంది క్రీడాకారులు పరుగులో పాల్గొని విజయవంతం చేశారు. క్రీడా సంఘాల ప్రతినిధులు, పిఇటిలు, క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఒలింపిక్ జ్యోతితో ప్రదర్శనలో కెఇ.ప్రభాకర్, డిఎస్‌పి మహబూబ్‌బాష




మాట్లాడుతున్న డిఇఒ శామ్యూల్ పాల్ , వేదికపై కెఇ.ప్రభాకర్, తదితరులు

# హామీలను అమలు చేయాలి

**-కలెక్టరేట్ ఎదుట వైసిపి యువజన విభాగం ధర్నా**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వై. శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్ట ప్రతుల్ మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గురించే ఆలోచిస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలు మోసానికి గురవుతున్నారన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తున్న పరిస్థితి ఉందన్నారు. డిఆర్ఒను కలిసి యువజన విభాగం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర కార్యాదర్శులు బుసిన చంద్రశేఖర్, ధరణి, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు దుర్గ ప్రసాద్ ,బాలు , నజీర్, వెంకటేష్ అశోక్ రెడ్డి ,అశోక్ నాయుడు ,రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వైసిపి యువజన విభాగం నేతలు



పాతబస్తిలో తాగునీరు రావడంలేదని నగరపాల సంస్థ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ముస్లిం మహిళలు

# ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 29 అర్జీలు**

**ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ :** ప్రజా ఫిర్యాదులు దృష్టికి రాగానే వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 29 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఆర్ఓ జునైద్, ఎంఇ లీలాప్రసాద్, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు. ఇంజనీరింగు కార్మికులు సమ్మెలో ఉన్నందున పాతబస్తిలో తాగునీరు రావడంలేదని నగరపాల సంస్థ కార్యాలయం ముందు ముస్లిం మహిళలు నిరసన తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లలకు విద్యారాయితీ ఇవ్వండి

**డిఆర్ఒకు వినతి ఇచ్చిన యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం నాయకులు**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

జర్నలిస్టుల పిల్లలకు విద్యారాయితీ కల్పించాలని కోరుతూ యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం(యుజెఎఫ్) జిల్లా అధ్యక్షులు డి.విద్యా సాగర్, జిల్లా కార్యదర్శి డి.చంద్ర మోహన్‌ల ఆధ్వర్యంలో సోమవారం సునయన ఆడిటోరియం, గ్రీవెన్స్‌లో డిఆర్ఒను కలిసి వినతిపత్రం అందచేశారు. ఫోరం వ్యవస్థాపక కార్యదర్శి చిన్న రామాంజనేయులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డి.చంద్రమోహన్, చిన్న రామాంజనేయులు మాట్లాడారు. జిల్లాలో పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో ఎలాంటి వేతనాలు లేకుండా పనిచేస్తున్న జర్నలిస్టులు పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు కృషి ఎంతో ఉందన్నారు. ఈ నేపథ్యంలో తమరు జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో ఉచిత విద్యారాయితీ అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వ్యవస్థాపక కోశాధికారి పి.యూసుఫ్‌ఖాన్, విజయ్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ కుమార్, మధు, జిల్లా నాయకులు కరణ్, లక్ష్మన్న, వారణాసి ప్రసాద్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న యుజెఎఫ్ నాయకులు

## 1 నుంచి ఎల్ఎల్‌సికి నీటి విడుదల

**- ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ టిప్పు సుల్తాన్**

**ప్రజాశక్తి - ఆదోని**



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

తాగు, సాగునీటి కోసం తుంగభద్ర దిగువ కాలువకు జులై 1 నుంచి నీరు విడుదల చేయాలని తీర్మానించినట్లు ఎల్ఎల్‌సి ప్రాజెక్టు ఈఈ పాండురంగయ్య, కమిటీ చైర్మన్ టిప్పు సుల్తాన్ తెలిపారు. సోమవారం ఆదోని టిబిపి ఎల్ఎల్‌సి కార్యాలయంలో ప్రాజెక్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎల్ఎల్‌సి పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, డిఇలు, ఏఇలు, ఇతర అధికారులు హాజరయ్యారు. వచ్చే వేసవిలో రబీ సీజన్‌కు కూడా సాగునీరు ఇవ్వాలని కోరారు. ఖరీఫ్–2025 కొనసాగింపుగా, 2025–26 రబీ పంటలకు మార్చి మొదటి వారం వరకు తుంగభద్ర ద్వారా దిగువ కాలువకు ప్రతిపాదించిన 17.774 టిఎంసిలను సరఫరా చేసేందుకు తీర్మానం చేశారు. సంఘాల పరిధిలో జరుగుతున్న పనులు పూర్తి చేయాలని, గురు రాఘవేంద్ర ప్రాజెక్టును తుంగభద్ర ప్రాజెక్టులో విలీనం చేయాలని తీర్మానించారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరారు. డిసి కమిటీ చైర్మన్లు ప్రసాద్, రమాకాంత్ రెడ్డి, అనంతసేనారెడ్డి, బోయ ఖాసీం, గోవర్ధన్ రెడ్డి, హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి, సోమశేఖర్, డిఇలు షఫీవుల్లా, విద్యాసాగర్, సుబ్బరాయుడు, ఎఇ ఈశ్వర్ ఉన్నారు.

## కార్మికులకు బకాయి వేతనాలివ్వాలి

**- సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వాచ్‌మెన్, పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, స్కూల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేవలం రూ.6 వేల వేతనం జీవనానికి సరిపోవడం లేదని, ప్రస్తుత మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వం మూడు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని కోరారు. రాజకీయ పేరుతో చిరు ఉద్యోగులను, పారిశుద్ధ్య కార్మికులను, నైట్ వాచ్‌మెన్‌ను తొలగించడం అన్యాయమని తెలిపారు. అనంతరం ఎంఇఒలు ఆంజనేయులు, మధుసూదన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. బాషా, గణేశ, ప్రతాప్, వరలక్ష్మి, కవిత, పార్వతమ్మ, నారాయణమ్మ, నాగేష్, సిఐటియు నాయకులు పి.రాజు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

**- ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు**

**ప్రజాశక్తి - ఆదోని**



ఫిర్యాదు ఇస్తున్న ఎరుకల రవి, దేవదాస్

నియోజకవర్గంలోని ఢణాపురం దళిత సర్పంచి పి.చంద్రశేఖర్‌పై వివక్ష ప్రదర్శించిన ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి నాయకులు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ దేవదాసు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒ వసుంధరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళిత, గిరిజన ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎమ్మెల్యే పార్థసారథి వ్యవహరించారని విమర్శించారు. సర్పంచిని బహిరంగ సభలో, ఆయన గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్యే పార్థసారథి, గుడిసె కృష్ణమ్మలు అవమానపరిచారని తెలిపారు. వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసును నమోదు చేసి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఇస్వీ పోలీస్ స్టేషన్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఎమ్మెల్యే పార్థసారథి, గుడిసె కృష్ణమ్మలు పలుకుబడి ఉపయోగించి కేసు నమోదు చేయించకుండా అడ్డుకున్నారని తెలిపారు. దళిత, గిరిజన నాయకులు దేవదాస్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎరుకల సూర్య, కెవిపిఎస్ నాయకులు శ్రీలక్ష్మి, సాయిరాం, వీరేష్, తారక్, శంకర్, రామలింగ ఉన్నారు.

## క్షయపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి - కోసిగి**


క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు తెలిపారు. సోమవారం మండలంలోని ఆర్లబండ గ్రామంలో ఆర్లబండ సర్పంచి మజ్జిగ మల్లికార్జున ఆధ్వర్యంలో టిబి ముక్త్ భారత్ అభియాన్, జాతీయ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి సి.రజిత, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు, క్షయ నివారణ ఆరోగ్య పర్యవేక్షకులు స్వరూప్, భాస్కర్, ఎంఎల్‌హెచ్‌పి పూర్ణిమ, ఎఎన్ఎం శంకరమ్మ, ఆశాలు, గ్రామస్తులతో కలిసి అవగాహన కల్పించారు.

# ఫీజుల దోపిడీ..!

- ప్రయివేట్ పాఠశాలల 'అక్షర' వ్యాపారం
- నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలేవి..?

**ప్రజాశక్తి - నందవరం**

**నందవరం గ్రామంలో ప్రయివేట్ పాఠశాలలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తూ అక్షరాలతో వ్యాపారం చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా.. ఇష్టానుసారంగా ఫీజులను దండుకుంటున్నారు. అలాంటి పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోరా అంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.**




నందవరం గ్రామంలో ఐదు ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 1,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. నందవరం గ్రామం నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా విద్యార్థులు వస్తున్నారు. యుకెజికి రూ.11 వేల నుంచి రూ.14 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రయివేట్ పాఠశాల ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. సొసైటీ లేదా ట్రస్టులతో లాభాపేక్ష లేని.. ప్రతి విద్యార్థికీ విద్య అందించేలా చూసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో విద్య ఒక వ్యాపారంగా మారుతోంది. కొత్త, కొత్త పేర్లు పెట్టుకుని ప్రయివేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ అనుమతులు లేకపోయినా, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోకుండా విద్యార్థులు, సిబ్బంది ఉండడానికి అనుకూలంగా ఉందని, భద్రత లేని.. ప్రమాదం కలిగించే పెద్ద లోపాలు ఏవీ లేవని నిర్ధారిస్తూ పాఠశాలను నిర్మిస్తున్నారు. భద్రతను ధ్రువీకరించే పత్రం, అగ్నిమాపక ధ్రువీకరణ పత్రం లేకపోయినా పెంకుల షెడ్డులో పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యనందిస్తున్నారు. అడ్మిషన్ చేసే క్రమంలో తల్లిదండ్రులకు లేనిపోని మాటలు చెబుతూ బురిడీ కొట్టిస్తున్నారు. 'ఆ పాఠశాల కంటే మా పాఠశాల గొప్పది. బస్ సౌకర్యం కూడా ఉంది. ఫీజు కూడా తక్కువే ఉంటుంది. ఆ పాఠశాలలో చదువు, మా పాఠశాలలో చదువుకు చాలా వ్యత్యాసం ఉంటుంది' అంటూ కొన్ని పాఠశాలల యజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి డబ్బులను దండుకుంటున్నారు. మరోవైపు పాఠశాలలో చేరిన వెంటనే నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, యూనిఫారం, బెల్ట్, షూస్, పాఠ్యపుస్తకాలు, ఇతర స్టేషనరీ తమ దగ్గరే కొనుక్కోవాలని నిబంధనలు పెడుతున్నారు. విద్యా వ్యాపారం కాదని జిఒ నెంబర్ 1లో స్పష్టంగా తెలియజేసినా ప్రయివేట్ పాఠశాలలు మాత్రం దానిని పాటించడం లేదు. ఇష్టా రాజ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రస్తుతం అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. బస్సుల్లో పరిమిత సంఖ్య కంటే ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కిస్తూ బస్సులు నడుపుతున్నారని పలువురు వాపోతున్నారు.

### పోరాటాలకు సిద్ధమవుతాం

**- రంగప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**



తక్షణమే ప్రభుత్వ అనుమతులు లేని ప్రయివేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేసి ప్రతి ప్రయివేట్ పాఠశాలలో ఫీజు నిర్ణయాలకు సంబంధించి గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయాలి. ఫిట్‌నెస్ లేని వాహనాలు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఆ పాఠశాలలపై అధికారులు చర్యలు చేపట్టకపోతే పోరాటాలకు సిద్ధమవుతాం.

### నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు

**- రామాంజనేయులు, ఎంఇఒ**

ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కొన్ని రోజుల క్రితమే ఎంఇఒగా ఇన్‌ఛార్జ్ తీసుకున్నా. పాఠశాలలపై పర్యవేక్షణ చేపడతా.

## ప్రజల రుణం తీర్చుకోలేనిది

**- సర్పంచి సుధాకర్**

**ప్రజాశక్తి - హోళగుంద**



అతి చిన్న వయస్సులోనే తనను సర్పంచిగా ఎన్నుకున్న తమ గ్రామస్తులకు ఎంత చేసినా రుణం తీర్చుకోలేనిదని సర్పంచి సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. గ్రామానికి అంకిత భావంతో పని చేసి అభివృద్ధిలో సాటిలేని గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. సర్పంచిగా ఎన్నికైనప్పటి నుంచి గ్రామంలో 15వ ఫైనాన్స్ నిధులతో రూ.22 లక్షలతో సిసి రోడ్లు, గ్రావెల్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, లైన్స్, విద్యుద్దీపాలు, జంగిల్ క్లీనింగ్, గ్రామం మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించామన్నారు. ఉపాధి హామీ నిధులు రూ.20.70 లక్షలతో గ్రామంలోని సిసి రోడ్లు, రూ.20 లక్షలు అంగన్వాడీ భవనం దగ్గర బాత్‌రూముకు, రూ.36 వేలు మూగజీవాల నీటి తొట్టెకు, రూ.34 వేలు, కర్నూలు ఎంపీ చొరవతో గ్రామం మొత్తం రూ.90 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయినేజీలకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. తనకు సహకరించిన ప్రజలు, మహిళలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని చెప్పారు. తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - కోసిగి**



కోసిగి ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా ఈశ్వరయ్య స్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈశ్వరయ్య స్వామి సి.బెళగల్ డిప్యూటీ ఎంపిడిఒగా పని చేస్తూ ఆలూరుకు డిప్యూటీ ఎంపిడిఒగా బదిలీ అయ్యారు. ఆలూరు రెగ్యులర్ కాగా, మంత్రాలయం, కోసిగి మండలాలకు ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా ఉన్నతాధికారులు నియమించినట్లు తెలిసింది. కోసిగిలో ఇప్పటివరకు ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు డోన్ నియోజకవర్గం ప్యాపిలికి బదిలీపై వెళ్లారు. మండలంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈశ్వరయ్య స్వామి తెలిపారు.

## శ్రీకాళహస్తిలో ఎంపిపిలకు ప్రత్యేక శిక్షణ తరగతులు

**- ఎంపిడిఒ అల్లా బకాష్**

**ప్రజాశక్తి - చిప్పగిరి**



ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా ఎంపిపిలకు శ్రీకాళహస్తిలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. సోమవారం ఆయన మండల కార్యాలయంలో మాట్లాడారు. మహిళా ఎంపిపిలకు మాత్రమే ప్రత్యేక శిక్షణ తరగతులను ఈనెల 25, 26, 27వ తేదీల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 32 మంది మహిళా ఎంపిపిలకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. చిప్పగిరి మండలం నుంచి ఎంపిపి జూటూరు హేమలతకు అవకాశం కల్పించారని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## 'తాగునీటి సమస్య పరిష్కరించండి'

**ప్రజాశక్తి - మంత్రాలయం**

మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షాలు కురిస్తే ప్రతి కాలనీ చిత్తడిగా ఉంటుందని తెలిపారు. ఆయా కాలనీల్లో కనీసం గ్రావెల్ రోడ్డు వేయడానికి కూడా అధికారులు చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు. తాగునీరు లేకపోయినా అధికారులు గ్రామాల వైపు తొంగి చూడడం లేదని విమర్శించారు. కల్లుదేవకుంట, చిలకలడోణ గ్రామాలకు 10 రోజులకోసారి నీరు వదులుతున్నారని తెలిపారు. వారానికి రెండు సార్లయినా నీరు వదలాలని కోరారు. దేవపుత్ర, జి.రవి, ఎం.బాబు, ఎం.వీరేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## మాజీ ఎమ్మెల్యే సాయిపై 'కూటమి' ఫిర్యాదు

**ప్రజాశక్తి - ఆదోని**

వైసిపి నియోజకవర్గ ఇనచార్జీ, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిపై కూటమి నాయకులు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఢణాపురం సర్పంచి చంద్రశేఖర్‌ను 'ఎస్సీ' అని వీడియో చూస్తూ సంబోధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాయి ప్రసాద్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. నాయకులు వీరేష్, పులిరాజు, నాగార్జున ఉన్నారు.

# తాగునీటికి ఇబ్బందులు..!

**- సమస్య పరిష్కరించాలని ప్రజల బైఠాయింపు**

**ప్రజాశక్తి - కౌతాళం**

తాగునీరందక ఇబ్బందులు పడుతున్నామని అత్తరు వీధి కాలనీ ప్రజలు అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించారు. సోమవారం కాలనీ మహిళలు, వృద్ధులు, యువకులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. 12 రోజులవుతున్నా తాగునీరందకపోతే ఎలా అంటూ ఆందోళనకు దిగారు. తాగునీటి సమస్య పరిష్కారమయ్యే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని నిరసన వ్యక్తం చేస్తూ కూర్చున్నారు. దీనిపై స్పందించి సర్పంచి పాల్ దినకరన్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశం సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని, ఆందోళనను విరమించాలని కోరారు. 'మీరు ఇలాగే చెప్తారు. మా సమస్య పరిష్కారం కాదు.. ఇంటికి తాగునీరు వచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు' ఒంటూ భీష్మించారు.

**తాగునీరందుకుంటే రాజీనామా చేస్తాం : సర్పంచి పాల్ దినకరన్**

కాలనీ ప్రజలకు రెండు రోజుల్లో తాగునీరందుకుంటే సర్పంచి పదవికి రాజీనామా చేస్తానని పాల్ దినకరన్ పేర్కొన్నారు. తాగునీరు అందిస్తామని రాతపూర్వకంగా ఇవ్వాలని సర్పంచిని కాలనీ వాసి మహ్మద్ రఫీ డిమాండ్ చేయగా, పై విధంగా సమాధానం ఇవ్వడంతో ప్రజలు ఆందోళనను విరమించారు.

**సమస్యను పరిష్కరించకుంటే రిలే నిరాహార దీక్షలు : సిపిఎం**

కౌతాళంలో తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే ప్రభుత్వ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య హెచ్చరించారు. ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలం వచ్చినా 10, 12 రోజులకోసారి తాగునీరు అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు పుష్కలంగా ఉన్నా ప్రజలకు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. ఎస్ఎస్ ట్యాంకు వద్ద 24 గంటలూ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేక మోటార్ ఏర్పాటు చేసి అదనంగా మరో పైపులైన్ ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై గతంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేదని పేర్కొన్నారు. జులై 1లోపు నీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చారు. స్పందించిన సిపిఎం నాయకులు మాట్లాడుతూ... జులై 10 వరకు పరిష్కారం కోసం చూస్తామని, సమస్య పరిష్కరించకుంటే రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. నాయకులు రామలింగ, చిన్న మారయ్య, నాగరాజు, హరిజన నరసప్ప, మహానంది పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో బైఠాయించిన ప్రజలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# పేరు గొప్ప.. ఊరు దిబ్బ...

**- రోడ్డుపైనే డ్రెయినేజీ నీరు**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం పేరు గొప్ప.. ఊరు దిబ్బ అనడానికి నిదర్శనంగా నిలిచింది. రోడ్డుపై ఎప్పుడూ డ్రెయినేజీ నీరు ప్రవహిస్తూ భక్తులకు, గ్రామస్తులకు ఇబ్బందులు కలిగిస్తోంది. సోమవారం కూడా ఇదే దుస్థితి నెలకొంది. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఎంతో శుభ్రతతో స్నానాలు చేసి భక్తితో ఆలయానికి వెళ్తుండగా ఈ మురుగు నీటిలో ముక్కు మూసుకొని నడిచి వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న మంత్రాలయంలో ఎప్పుడో గతంలో చిన్నపాటి పైపులైన్‌తో వేసిన డ్రెయినేజీ వ్యవస్థ వల్ల సమస్య ఎదురవుతోంది. 'నీరు పల్లమెరుగు' అనే సత్యాన్ని పక్కన పెట్టి రూపొందించిన ఇంజినీర్ నిర్వాకం వల్ల రూ.10 కోట్ల ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ కేవలం మోటారు ద్వారా పంపింగ్ చేస్తే తప్ప మురుగు నీరు వెళ్లవు. ప్రస్తుతం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న బావి నుంచి మురుగు నీటిని పంపింగ్ చేసే రెండు మోటార్లు చెడిపోవడంతో రెండు రోజులుగా పంపింగ్ చేయలేదు. దాని కారణంగా డ్రెయినేజీ చాంబర్ ద్వారా రోడ్డుపైకి నీరు చేరిందని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరాముడుతో జరుగుతున్న మోటారు అమర్చే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చెడిపోయిన మోటార్లకు మరమ్మతులు చేయించి మళ్లీ అమర్చుతున్నట్లు తెలిపారు. శ్రీస్వామి మఠం ఎదురుగా ఉన్న ఎంటిఆర్ హోటల్ వారు అనుమతి లేకుండా అక్రమంగా డ్రెయినేజీ పైపు లైన్‌కు కనెక్షన్ తీసుకున్నారని, వారు వేసిన వ్యర్థాల వల్ల పైపులైన్‌కు అడ్డంగా పడి నీరు రోడ్డు పైకి చేరిందని చెప్పారు. ఎంటిఆర్ హోటల్ యజమానికి నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం కానీ, శ్రీమఠం యాజమాన్యం కానీ స్పందించి గ్రామంలో పెరిగిన జనాభాకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కొత్త పైపులైన్ వేసి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

## 'వైష్ణవి' ఆధ్వర్యంలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్

**- వైష్ణవి విద్యాసంస్థల గ్రూప్ చైర్మన్ జిడి.లింగప్ప**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**



పట్టణానికి చెందిన వైష్ణవి అకాడమీ (కొండవీటి ప్రాంతం సోగనూరు రోడ్డు) ఆధ్వర్యంలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు వైష్ణవి విద్యా సంస్థల గ్రూప్ చైర్మన్ జిడి.లింగప్ప పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. వైష్ణవి అకాడమీ ఆధ్వర్యంలో జి–30 పేరుతో లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. కర్నూలు పశ్చిమ ప్రాంతంలో డాక్టర్ కావాలనే లక్ష్యం ఉన్నవారు విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, నిష్ణాతులైన.. అనేక సంవత్సరాల అనుభవం ఉన్న బోధకులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. విశాలమైన గదులు, బ్యాచికి 30 మంది విద్యార్థులు, ఏసీతో కూడిన డిజిటల్ బోర్డులతో కూడిన గదులు, బాలబాలికలకు వేర్వేరు హాస్టల్ వసతి ఉందని తెలిపారు. ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజల పిల్లలకు ఫీజులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సామాన్య, మధ్య తరగతి విద్యార్థులతో కూడా నీట్‌లో సీట్లు సాధింపజేసి వైద్య విద్యార్థులుగా తీర్చిదిద్దడమే తమ అకాడమీ లక్ష్యమని చెప్పారు. ఈ కోర్సు ఈనెల 24న ప్రారంభమవుతున్నట్లు తెలిపారు.

## 'అనుమతులు లేనిదే అడ్మిషన్లు వద్దు'

**ప్రజాశక్తి- దేవనకొండ**



దేవనకొండలో నూతనంగా ఏర్పాటు చేసిన జీనియస్ గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి అనుమతులు రాలేదని, విద్యార్థుల అడ్మిషన్లు చేసుకోరాదని ఎంఇఒ తిమ్మారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. అనుమతులు లేనిదే అడ్మిషన్లు చేసుకుంటున్నారని విద్యార్థి సంఘాలు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. పాఠశాలను సందర్శించి అనుమతులు లేకపోవడంతో అడ్మిషన్లు చేసుకోరాదని నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ పాఠశాలలను నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం'

**ప్రజాశక్తి - ఆదోని**

మున్సిపల్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీరా, సోమన్న విమర్శించారు. పట్టణంలోని కోట్ల కూడలిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన దీక్షలు సోమవారం 21వ రోజుకు చేరుకున్నాయి. భీమాస్ కూడలిలో కార్మికులు మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు సోమన్న, మహ్మద్, కరీముల్లా, ప్రకాష్, కర్రెప్ప, మూర్తి పాల్గొన్నారు.

## 'సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి'

**ప్రజాశక్తి - దేవనకొండ**

గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని అన్ని సచివాలయాల సర్వేయర్లు కోరారు. సోమవారం తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. పే స్కేల్‌లో తగిన మార్పులు చేయాలని, సీనియారిటీ జాబితాను, అర్హత ఉన్న వారందరికీ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఆర్ఎస్ హెల్త్ ఇనిస్టిట్యూట్‌ను తనిఖీ చేయాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - ఆదోని**

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులూ లేకుండా నిర్వహిస్తున్న ఆర్ఎస్ హెల్త్ ఇనిస్టిట్యూట్‌ను ఉన్నతాధికారులు తనిఖీ చేసి, నిజాలు నిగ్గు తేల్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆర్ఎస్ హెల్త్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎఒ వసుంధరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డులో నిర్వహిస్తున్న ఆర్ఎస్ హెల్త్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతోందని తెలిసిందన్నారు. సరైన అనుమతులు లేకుండానే అడ్మిషన్లు తీసుకుంటూ వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థినుల భవిష్యత్తును అంధకారం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులూ లేకున్నా ముందే అడ్మిషన్ నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులని మోసం చేస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తనిఖీకి వచ్చిన సందర్భంగా అప్పటికప్పుడు వేరే కళాశాల భవనాన్ని చూపించి అధికారులను బురిడి కొట్టించారని తెలిపారు. విచారణ చేపట్టి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ఆ కళాశాల భవన యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. ఇప్పటికే పలు దఫాలుగా అధికారులకు విన్నవించామని, కనీసం తనిఖీ చేయకుండా పెడచెవిన పెడుతూ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఇనిస్టిట్యూట్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని కోరారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఉత్తేజ్, లోకేష్, ఉదయ్, ఉచ్చీరప్ప ఉన్నారు.




ధర్నాలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

## జెండా ఏర్పాటుకు భూమిపూజ

**ప్రజాశక్తి - చిప్పగిరి**

చిప్పగిరిలో ఎంఆర్‌పిఎస్ జెండా ఏర్పాటుకు భూమిపూజ చేశారు. సోమవారం ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు జిఎస్.నెట్టు కనకయ్య మాదిగ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పి సీనియర్ నాయకులు పులికుంట్ల గోపి మాదిగ, కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జీ, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు (చిన్న) మాదిగ హాజరయి మాట్లాడారు. జులై 7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా దిమ్మెల నిర్మాణం, ఆవిర్భావ దినోత్సవ సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల గాదిలింగయ్య, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు సుధాకర్, రమేష్, దావద్, మాజీ మిర్త్రీ పెద్దయ్య, రాజరత్నం, డి.లాజర్, రామచంద్ర, లవన్, ఉచ్చ రంగప్ప, గంగాధర్, ఎంపిటిసి మల్లి, చంద్ర శేఖర్, మల్లయ్య, కిశోర్, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న నాయకులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎఇ వీరేష్

## రాయితీతో సోలార్ రూఫ్ టాప్ : ఎఇ

**ప్రజాశక్తి - కోసిగి**

రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుని విద్యుత్ బిల్లును తగ్గించుకోవాలని విద్యుత్ శాఖ ఎఇ వీరేష్ కోరారు. సోమవారం స్థానిక తేరుబజార్ ఆవరణలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సోలార్ రూఫ్ టాప్ పథకం ప్రవేశపెట్టాయని తెలిపారు. ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందని, ఇంటిపై కప్పుపై కనీసం 10 చదరపు అడుగులు, 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే రాయితీపై వస్తుందని చెప్పారు. ఒక కిలో వాట్‌కు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఈ పథకానికి ప్రభుత్వ రాయితీ రూ.30 వేలు ఇస్తుందని తెలిపారు. ఏడాదికి రూ.8 వేలు ఆదా అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ చిదానంద, లైన్‌మెన్ గౌడ్, జిలాని పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల నిరసన

**ప్రజాశక్తి - ఆదోని**

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం ముందు సోమవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు వెంకప్ప, చంద్రశేఖర్, నాగరాజు, శ్రీమన్ మాట్లాడారు. సీనియారిటీ ప్రమోషన్లు కల్పించిన తర్వాతనే ట్రాన్స్‌ఫర్లు నిర్వహించాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని కోరారు. ఇంక్రిమెంటు ఇవ్వాలని, సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒ వసుంధరకు, మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఉద్యోగులు అమరేష్, శ్రీనివాసులు, శంకరమ్మ, కృష్ణవేణి ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు